స్థానిక సంస్థల్లో మేరు కులస్తులకు రిజర్వేషన్లు కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న మేరు సంఘం నాయకులు

గౌలిపురా: చేతివృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మేరు కులస్తులకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర మేరు సంఘం నాయకులు, డేడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్ రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు కీర్తి రాజగోపాల్, దీకొండ నరసింగ రావు, ఎస్.బి.సంగేవార్, కిష్టారెడ్డి పేట వెంకటేశ్, మాడిశెట్టి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... నిరుపేదలైన మేరు కులస్తులు అన్ని రంగాల్లో ఎంతో వెనుకబడి ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 లక్షలకు పైగా మేరు కులస్తులు ఉన్నారని.. ఇందులో కులవృత్తుల్లో పని చేసే వారి సంఖ్య అధికంగా ఉందని, వారికి ప్రభుత్వ పరంగా రిజర్వేషన్లు కల్పించి ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో మేరు కులస్తులను ప్రత్యేకంగా గుర్తించి ప్రభుత్వ పరంగా మేలు జరిగేలా కృషి చేయాలని మేరు సంఘం నాయకులు ప్రత్యేక కమిషన్ చైర్మన్‌ను కోరారు.

విజేతలకు సత్కారం



గన్‌ఫౌండ్రీ: ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన ఇంటర్‌కాలేజ్ టోర్నమెంట్‌లో పతకాలు సాధించిన సర్దార్‌పటేల్ కళాశాల విద్యార్థులను ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు జీవీ.రంగారెడ్డి, తదితరులు సత్కరించారు. సర్దార్‌పటేల్ కళాశాల విద్యార్థులు 13 మెడల్స్ సాధించారు. 9 గోల్డ్ మెడల్స్, 2 బ్రాంజ్ మెడల్స్, 2 సిల్వర్ మెడల్స్‌లను సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ఎగ్జిబిషన్ సొసైటీ మాజీ కార్యదర్శి జీవీ.రంగారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ.... ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగే విద్యాసంస్థల విద్యార్థులు క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

ముగిసిన ఇంటర్ కాలేజ్

మహిళల జూడో చాంపియన్‌షిప్



విజేతలతో నిర్వాహకులు

గోల్కొండ: ఉస్మానియా యూనివర్సిటీ మహిళల జూడో ఇంటర్ కాలేజ్ ఛాంపియన్‌షిప్ మంగళవారం ముగిసింది. మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో జరిగిన ఈ పోటీల్లో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మహిళా కళాశాలలు పాల్గొన్నాయి. 48 కేజీల కేటగిరిల్లో సీబీఐటీ కళాశాల విజేతగా నిలవగా కస్తూర్బా, సెయింటాన్స్, ఎస్ఎన్ వనిత మహావిద్యాలయ కళాశాలలు తరువాత స్థానాల్లో నిలిచాయి. 52 కేజీల విభాగంలో సెయింటాన్స్ కాలేజీ విజేతగా నిలవగా సెయింట్ ఫ్రాన్సిస్, కస్తూర్బా మహిళా కళాశాల రెండవ, మూడో స్థానాలు దక్కించుకున్నాయి. 57 కేజీల విభాగంలో సెయింటాన్స్ మహిళా కళాశాల విజేతగా నిలిచింది. 63 కేజీల విభాగంలో డెక్కన్ మహిళా కళాశాల మొదటి స్థానంలో నిలవగా సెయింటాన్స్, కస్తూర్బా, రిషి మహిళా కళాశాలలు తరువాత స్థానాల్లో నిలిచాయి. 70 కేజీల విభాగంలో సెయింటాన్స్ కళాశాల విజేతగా నిలిచింది. 78 కేజీల విభాగంలో సెయింటాన్స్, కస్తూర్బా కళాశాలలు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. 78 కేజీల విభాగంలో వెస్లీ, సెయింటాన్స్, కస్తూర్బా కళాశాలలు మొదటి మూడు స్థానాలు ఆక్రమించాయి. ఓవరాల్‌గా సెయింటాన్స్ కళాశాల తొమ్మిది పాయింట్లతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది.

వాహనాలు తొలగించండి సారూ..



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

లంగర్‌హౌస్: కార్తీక దుప్కి పున్నమి జాతరకు ఓ వైపు ఏర్పాట్లు చేస్తుండగా మరో వైపు ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం భక్తులకు ఇబ్బందిగా మారింది. త్రివేణి సంగం ఒడ్డున ట్రాఫిక్ పోలీసులు జప్తు చేసిన వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం అదే స్థలంలో ఉత్తర భారతదేశానికి చెందిన భక్తులు భజనలు చేసి, సహపంక్తి భోజనాలు చేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో పార్కు చేసిన వాహనాలను తొలగించాలని సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆలయ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముక్తి స్నానాలకు ఒక్క రోజే ఉందని ఇకనైనా అధికారులు స్పందించి వాహనాలు తరలించి భక్తులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరుతున్నారు.

మహారాష్ట్రలో మజ్లిస్ గెలుపు ఖాయం



ముంబైలో ప్రచారం చేస్తున్న రవియాదవ్ తదితరులు

అబిడ్స్: మహారాష్ట్రలో మజ్లిస్ పార్టీ విజయ ఢంకా మోగిస్తుందని మాజీ కార్పొరేటర్ మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు రవి యాదవ్ అన్నారు. ముంబై ప్రాంతంలోని కుర్లా అసెంబ్లీ నియోజకవర్గంలో ఆయన మజ్లిస్ తరపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రవి యాదవ్ ఫోన్‌లో మాట్లాడుతూ మహారాష్ట్రలో మజ్లిస్ పార్టీ అధ్యక్షులు ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి ప్రజలు పూర్తి ఆదరణ చూపుతున్నారన్నారు. మహారాష్ట్రలో మజ్లిస్ పోటీచేస్తున్న అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

గోల్కొండ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ అభ్యర్థులు గెలవాలని కోరుతూ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ హజ్రత్ మంగళవారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మజ్లిస్ పక్కా సెక్యూలర్ పార్టీ అని ఈ విషయం తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల వారికి కూడా తెలుసునన్నారు. తమ పార్టీ అధిష్టానం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో మజ్లిస్ అభ్యర్థులను నిలబెట్టిందన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, అజీజ్‌ఖాన్ పటాన్, జుబేర్‌బిన్ అవద్ ఉన్నారు.



తవ్వి వదిలేశారు..!

- అసంపూర్తి పనులతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు

గోల్కొండ: ప్రధాన రహదారుల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అసంపూర్తిగా వదలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్వాన్, టోలిచౌకీ, గోల్కొండ, నానల్‌నగర్ తదితర డివిజన్లలో భారీ వరద నీటి పైపులైన్‌లు, డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయి. అయితే అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న భారీ పైపులైన్ పనుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిసర కాలనీల ప్రజలు తరచూ ఈ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. పైపులు వేయడానికి రోడ్లను తవ్వి వదిలేస్తున్నారు. పైపుల ఏర్పాటు పూర్తయినా గుంతలను మూయడం లేదు. ఇటీవల సూర్యనగర్ కాలనీ వద్ద గల గుంతలో పడి వృద్ధుడు మృతి చెందినా అధికారుల్లో చలనం రాలేదు.

పట్టించుకోని అధికారులు...

నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్న అధికారులు పట్టించుకోవడం లేదు. టోలిచౌకీ-ఎండిలైన్స్ మీదుగా గోల్కొండ మోతీదర్వాజా వరకు చేపట్టిన పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో గోల్కొండ మోతీదర్వాజా నుంచి టోలిచౌకీ, మెహిదీపట్నం వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా వాహనదారులు బంజారా దర్వాజా మీదుగా గోల్కొండకు వస్తుండటంతో ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. మరికొన్ని చోట్ల పైపులు వేయడం పూర్తయినా గోతులను పూడ్చిన అధికారులు రోడ్డు వేయడం లేదు. దీంతో ద్విచక్ర వాహనాదారులు రోడ్డుపై రాకపోకలు సాగించడానికి నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిలిచిపోయిన పనులను పూర్తి చేయించాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.



టోలిచౌకీ-టూంబ్స్ రోడ్డుపై అసంపూర్తిగా వదిలేసిన పనులు



రంగనాథస్వామి దేవాలయం వద్ద రోడ్డు దుస్థితి

జియాగూడలోనూ..

జియాగూడ రహదారిలో పైప్‌లైన్ నిర్మాణం నిమిత్తం రోడ్డు తవ్విన అధికారులు పనులు ముగిసినా రోడ్డు వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంత మేరకు బీటీ రోడ్డు వేసిన కాంట్రాక్టర్ రంగనాథ దేవాలయం నుంచి కేజీఎన్ హోటల్ వరకు అలాగే వదిలేయడంతో రాత్రి వేళల్లో వాహనదారులు కింద పడి గాయాల పాలవుతున్నారు.

రెవెన్యూ ఉద్యోగులపై దాడులు అమానుషం

అబిడ్స్: రెవెన్యూ ఉద్యోగులపై దాడులు అమానుషమని ఇందుకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీష్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులపై దాడి చేయడాన్ని తెలంగాణ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ జేఏసీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ దాడి ప్రజాస్వామ్యానికి విఘాతమన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేయడంతోనే అధికారులకు, గ్రామ ప్రజల మధ్య దూరం పెరిగిందన్నారు.

ముమ్మరంగా కుల గణన కార్యక్రమం



జియాగూడ: జియాగూడలో కులగణన కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. మంగళవారం జియాగూడలో ఇంద్రనగర్, కురుమ బస్తీ, లడ్డు పహిల్వాన్ లేన్‌లలో జీహెచ్ఎంసీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు కెఎస్.ప్రేమ్‌కిషోర్ కటిక, వినోద్‌కుమార్, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జ్వాలా తోరణం..



రథయాత్రకు సిద్ధం చేస్తున్న పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: కార్తీక పౌర్ణమి ముక్తి స్నానాల జాతరలో ప్రధాన ఘటం బుధవారం ప్రారంభంకానుంది. దుప్కి పున్నమి రోజు రథయాత్ర నేపథ్యంలో పీఠాధిపతి 1008 రాహుల్ దాస్ బాబా మంగళవారం పనులు ప్రారంభించారు. ఈ జాతరలో భాగంగా బుధవారం తులసీ, లక్ష్మీ సమేత నారాయణుల కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం జ్వాలా తోరణాన్ని వెలిగించి స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా చిలుక ద్వాదశిని పురస్కరించుకొని సహస్రనామ ఘటాభిషేకం, హోమం, సుందరకాండ పారాయణం నిర్వహించనున్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

బహదూర్‌పురా: జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు కొనసాగుతున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనుల్లో భాగంగా మంగళవారం రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పనుల పురోగతిని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ శివకుమార్ నాయుడు, ఫలక్‌నుమా సర్కిల్-10 అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు అడ్డంగా ఉన్న భవనాలను తొలగించారు. కార్యక్రమంలో సౌత్ జోన్ సిటీ ప్లానర్ మాజిద్, సౌత్ జోన్ డీసీపీ కె.ఎస్.మెహ్రా, ఫలక్‌నుమా సర్కిల్-10 టీపీఎస్ మహేందర్, ఏఈ మహ్మద్ ఫైసల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సంతోష్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రుమాన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎక్స్ రోడ్డు హై కింగ్ బేకర్స్ ప్రాంతంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన పెట్రోలింగ్ పోలీసులు స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా రవి

అఫ్జల్‌గంజ్: అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.లింగేశ్వర్‌రావు బదిలీ అయ్యారు. ఇదే ఏడాది మార్చి నుంచి అఫ్జల్‌గంజ్ పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయనను పోలీసు ఉన్నతాధికారులు సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సునావత్ రవిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

11 కేవీ జీవన్‌కళ్యాణ్ నగర్, మురాద్‌నగర్ ఫీడర్లు..

ఈ ఫీడర్ల పరిధిలోని జీవన్ కళ్యాణ్ నగర్, ఆలపాటి నగర్, హిల్ కాలనీ, మండి కింగ్, గుడిమల్కాపూర్ ప్రధాన రహదారి ప్రాంతాలు, ఎల్ఐసీ కాలనీ, మురాద్‌నగర్, ఎంపీ గార్డెన్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

11 కేవీ మెహిదీపట్నం కేబుల్ ఫీడర్..

ఈ ఫీడర్ పరిధిలోని వీవీ కాలనీ, ఎల్ఐసీ కాలనీ, ఎంఐజీహెచ్, దిల్‌షాద్‌నగర్, క్రాంతి నగర్, అంబ థియేటర్, ఇన్‌కంటాక్స్ కాలనీ, రాంమూర్తి కాలనీ, మెహిదీపట్నం బస్‌డిపో ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని వినియోగదారులు గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

అఫ్జల్‌గంజ్ పరిధిలో..

11 కేవీ సీతారామ్‌బాగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఇందిరానగర్, గుఫామందిర్, కిస్తి చమన్, నీడ్స్ హోటల్ లేన్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దూద్‌బౌలి, జించి చౌరాయి ఫీడర్ల పరిధిలోని బోయిగూడ, ప్రకాష్ టాకీస్, దారుస్సలాం ఎస్‌బీఐ బ్యాంక్, పాన్ మండి, మంగల్‌హాట్ మార్కెట్, అమర్‌నగర్ కాలనీ, వెటర్నిటీ, మంగళ్‌హాట్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

దవాఖానాలకు రోగుల తాకిడి



గోల్కొండ: సీజనల్ వ్యాధులు ప్రబలు తుండటంతో ప్రజలు సర్కారీ దవాఖానాలకు క్యూ కడుతున్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రితో పాటు గుడిమల్కాపూర్, షేక్‌పేట్, కార్వాన్ తదితర ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. గోల్కొండ ఏరియా ఆసుపత్రికి గత కొన్ని రోజులుగా 800-900 వరకు ఓపీ రిజిస్ట్రేషన్ అవుతుంది. ఆసుపత్రిలోని ల్యాబ్ సైతం రోగులతో కిటకిటలాడుతుంది. మరో వైపు మెహిదీపట్నం, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లోని ల్యాబ్‌లలోనూ రద్దీ నెలకొంది. ఏరియా ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉన్నారని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావు తెలిపారు. మందులకు కూడా కొరత లేదని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గౌలిపురా: వార్డు స్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పలువురు నేతలు అన్నారు. మంగళవారం బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఎలక్షన్ వర్క్‌షాప్ ఛత్రినాకలోని దావత్ గ్రాండ్ హోటల్‌లో జరిగింది. సమావేశంలో జిల్లా రిటర్నింగ్ అధికారి బంగారు శృతి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, బీజేపీ ఇన్‌చార్జి, జిల్లా ఇన్‌చార్జిలు అట్లూరి రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు జమాల్‌పూర్ శేఖర్, కొడి మహేందర్, ఆదర్శ మహేష్, ఆలే జితేంద్ర, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు. ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు బూత్‌స్థాయి ఎన్నికలు నిర్వహించి, బూత్ అధ్యక్షులను నియమించనున్నట్లు తెలిపారు.

పూల మార్కెట్ వెలవెల



గోల్కొండ: పండుగ సీజన్లు ముగియడంతో పూలకు గిరాకీ తగ్గింది. మరో వైపు పూల రైతులు మాత్రం తాము పండించిన పూలను మార్కెట్‌కు తెస్తూనే ఉన్నారు. గుడిమల్కాపూర్‌లోని ఇంద్రారెడ్డి పూలమార్కెట్‌కు పూలు భారీగానే వస్తున్నా గిరాకీ లేక పూల దుకాణాలు వెలవెలబోతున్నాయి. ప్రతినిత్యం పూజలు జరిగే ఆలయాల నిర్వాహకులు, బస్తీలు, కాలనీల్లో రిటేల్‌గా పూలు అమ్మే వారు మాత్రమే పూలను కొనుగోలు చేస్తున్నారని వ్యాపారులు పేర్కొంటున్నారు.

అసమగ్రంగా కుటుంబ సర్వే

- సర్వేకు ఎన్యుమరేటర్లు గైర్హాజరు
- హౌస్ కీపింగ్ సిబ్బందితో విధులు
- ఫారాలు నింపడం రావడం లేదంటూ స్థానికుల ఆగ్రహం



సర్వే చేస్తున్న మహిళలు



స్టిక్కర్‌లో మెహిదీపట్నం బదులుగా అహ్మద్‌నగర్ పేరు రాసిన దృశ్యం

నాంపల్లి: సమగ్రంగా జరగాల్సిన ఇంటింటి కుటుంబ సర్వే అసమగ్రంగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తూతూ మంత్రంగా కొనసాగుతోంది. మెహిదీపట్నం సర్కిల్-12లో పనిచేయాల్సి ఎన్యుమరేటర్లు సగానికి పైగా వివిధ కారణాలతో విధులకు గైర్హాజరవుతున్నారు. దీంతో సూపర్‌వైజర్లు వివిధ ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేసే హౌస్ కీపింగ్ సిబ్బంది, ఇళ్లలో ఖాళీగా ఉండే మహిళలతో సర్వే చేయిస్తున్నారు. సాధారణంగా సెకండరీ గ్రేడ్ టీచర్స్, అంగన్‌వాడీ టీచర్స్, ఆశా వర్కర్లు, స్వయం సహాయ బృందాల సభ్యులు ఈ సర్వే నిర్వహించాల్సి ఉంది. ఇందుకు గాను వారికి ముందస్తుగా వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం శిక్షణ తీసుకున్న సిబ్బంది సర్వే విధులకు డుమ్మా కొడుతుండటంతో శిక్షణ లేని వారితో సర్వే చేయిస్తుండటంతో వివరాల్లో పొరపాట్లు చోటు చేసుకుంటున్నాయి. కొందరు ఇంటింటికి వెళ్లకుండా అసమగ్రంగా ముగిస్తున్నారు. మరి కొందరు సర్వే ఫారాలు, ఇళ్లకు అతికించే స్టిక్కర్లను తప్పులను నింపుతున్నారు. సర్వే ప్రారంభమై వారం రోజులు పూర్తయినా చాలా చోట్ల స్టిక్కర్లు అతికించలేదు. సర్వే ప్రారంభమైన రెండు రోజుల్లోనే స్టిక్కరింగ్ అతికించే ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఆసిఫ్‌నగర్, మల్లేపల్లి ప్రాంతాల్లో ఈ ప్రక్రియ అసంపూర్తిగా మిగిలిపోయింది. ఇంటింటికి తిరిగి చేయాల్సిన సర్వే కేవలం వీధులకే పరిమితమైందనే ఆరోపణలు ఉన్నాయి.

శిక్షణ పొందిన వారితోనే సర్వే..

హౌస్ కీపింగ్ సిబ్బందితో సర్వే చేస్తున్నారనడం అవాస్తవమని మెహిదీపట్నం సర్కిల్-12 డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి అన్నారు. శిక్షణ తీసుకున్న వ్యక్తులే సర్వేలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల పర్యవేక్షణ జరుగుతోందని, క్షేత్రస్థాయిలో పర్యటించి తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. స్టిక్కరింగ్ ప్రక్రియ పూర్తికాలేదనే విషయం తన దృష్టికి రాలేదని, త్వరలోనే విచారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

- సురేందర్‌రెడ్డి, మెహిదీపట్నం సర్కిల్-12 డిప్యూటీ కమిషనర్

లాభాపేక్ష లేకుండా అత్యాధునిక వైద్య సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ వేద్ ప్రకాష్, డాక్టర్ రాఘువదత్, డాక్టర్ ఉదయ్ ప్రకాష్

అబిడ్స్: ఉదయ్ ఓమ్ని ఆసుపత్రిలో 50 ఏళ్లుగా లాభాపేక్ష లేకుండా నిరుపేదలకు అత్యాధునిక మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ వేద్ ప్రకాష్ అన్నారు. సోమవారం ఎల్బీస్టేడియం ఎదురుగా ఉన్న ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి డైరెక్టర్ రాఘవదత్ ములుకుంట్ల, డాక్టర్ ఉదయ్ ప్రకాష్‌లతో కలిసి ఆసుపత్రి సాధించిన ప్రగతి, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. 1974లో చిన్న క్లినిక్‌గా ప్రారంభించిన ఆసుపత్రి నేడు 150 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చెందిందన్నారు. దేశంలోనే ఆర్థోపెడిక్‌లో సీనియర్ అయిన తాను ప్రతి రోజు రెండున్నర గంటల పాటు వైద్య సేవలను అందిస్తూ ఆసుపత్రిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఉదయ్ ఓమ్ని ఆసుపత్రిని విస్తరించడం కంటే ఒకే యూనిట్ ఆసుపత్రిగా ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఆసుపత్రి డైరెక్టర్ వెన్నుముక సర్జరీ చీఫ్ డాక్టర్ రాఘవదత్ మాట్లాడుతూ... వైద్యులు దేవుళ్లు కారని తాము రోగులనే దేవుళ్లుగా చూస్తామన్నారు. అత్యంత నైతిక ఆసుపత్రి తమదేనని తెలుగు రాష్ట్రాల్లో తమకంటే నైతికంగా ఎవరూ ఉండలేరన్నారు. ఎవరైనా ఏ ఆసుపత్రికి వెళ్లినా శస్త్ర చికిత్స అవసరం ఉంటే సెకండ్ ఓపీనియన్ తీసుకోవాలని సూచించారు. తమ ఆసుపత్రిలో దేశంలోని పలు రాష్ట్రాల రోగులే కాక ప్రపంచంలోని అమెరికా, ఆస్ట్రేలియా, సూడాన్, కెన్యా, ఇరాక్, యెమెన్ దేశాలతో పాటు పలు దేశాల రోగులకు శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. డాక్టర్ ఉదయ్ ప్రకాష్ మాట్లాడుతూ తక్కువ ధరకే తమ ఆసుపత్రిలో అధునాతన శస్త్రచికిత్సలు చేస్తూ వైద్య రంగంలో ప్రపంచంలోనే ఉత్తమ సేవలందిస్తున్న ఆసుపత్రిగా గుర్తింపు పొందామన్నారు.